

ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన శ్రీలతకు అభినందన



శ్రీలతను సత్కరిస్తున్న ఎంపిడిఒ గౌరీ కుమారి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎన్. కొత్తపల్లి సర్పంచ్ కుంచే చిట్టికుమారి చిన్ని ల కుమార్తె శ్రీలత ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైంది. శ్రీలత ఎన్.కొత్తపల్లి సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం ఎన్.కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంలో శ్రీలతను ఎంపిడిఒ కెఎస్.గౌరీకుమారి, పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ, సిబ్బంది, సచివాలయాల సిబ్బంది దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి అభినందించారు.

సిఎం గారూ.. ఇవీ సమస్యలు..

- స్మార్ట్ సిటీ నిధుల విడుదల నిల్
- ఏలేరు, సుద్ధగడ్డ ఆధునికీకరణేదీ
- దారుణంగా రహదారులు
- నేడు కాకినాడకు సిఎం జగన్



కోటిపల్లి-నర్సాపురం రైల్వే పనులు కోసం వేసిన పిల్లర్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎన్నికలు మూడు నెలలు గడువు ఉండగా మరోసారి సిఎం వైఎస్.జగన్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపులో భాగంగా బుధవారం కాకినాడలో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరవుతున్నారు. వైసిపి పాలన మొదలై నాలుగేళ్ల 9 నెలలు కావస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను సిఎం ప్రస్తావిస్తారని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం కాకినాడ స్మార్ట్ సిటీ అభివద్ధి పనుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులను ఏళ్ల తరబడి విడుదల చేయడం లేదు. సుమారు రూ.180 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారు. దీంతో పలు అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. త్వరితగతిన మిగిలిపోయిన నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేయాలని నగరవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఏలేరు ఆధునీకరణకు ఎదురుచూపులు

ఏలేరు ప్రాజెక్టు సాగు నీటి ఆధారంగా జగ్గంపేట, పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లోని దాదాపు 53 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. 40 వేల మంది రైతులు ఆధారపడిన ఏలేరు ఆధునీకరణ పనులు ఎక్కడకక్కడ నిలిచిపోయాయి. ఫేజ్-2లో మిగిలిన 40 శాతం పనుల పూర్తికి రూ.394 కోట్ల నిధులతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఏటా ఈ ఆయకట్టు కింద రైతులు అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వైసిపి పాలన మరో మూడు నెలల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఈసారైనా తమ సమస్యలను పరిష్కరించాలని రైతాంగం కోరుతోంది. మరోవైపు గత టిడిపి ప్రభుత్వం రూ.160 కోట్లు కేటాయించి పనులకు శంకుస్థాపన చేసినా సుద్ధగడ్డ ఆధునీకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పనులు ముందుకు సాగడం లేదు. సుద్ధగడ్డ కాలువ ఆధునీకరణ జరిగితే గొల్లప్రోలు, ప్రత్తిపాడు మండలాల్లో సుమారు 25వేల ఎకరాల పంటలు సాగునీరు పుష్కలంగా అందడమే కాక ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



ఆధునికీకరణకు నోచుకోని ఏలేరు ప్రాజెక్టు

దారుణంగా రహదారులు

జిల్లాలో ప్రధాన రహదారుల దుస్థితి దారుణంగా మారింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1997 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆర్ అండ్ బి శాఖ రాష్ట్ర రోడ్లు, సుమారు 3 వేల కిలోమీటర్ల మేర జిల్లా రోడ్లు ఉండగా 50 శాతం వరకూ దెబ్బతిన్నాయి. వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వందల మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. వేలమంది గాయాల పాలవుతున్నారు. ప్రధానంగా కాకినాడ-రాజమండ్రి ఎడిబి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉన్నాయి. సుమారు 60 కిలోమీటర్లు పరిధిలో ఉన్న ఈ రోడ్డులో ఎక్కడ చూసినా మోకాల్లో గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఇటీవల పలు ప్రమాదాలు ఎక్కువగా జరిగాయి. పిఠాపురం-సామర్లకోట మధ్య రోడ్డుతో పాటు మండపేట వెళ్లే రహదారి, సామర్లకోట నుంచి ద్వారంపూడి మీదగా ధవళేశ్వరం వైపు వెళ్లే రహదారి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారుల ఆధునీకరణ పనులను త్వరితన చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు నిధులు నిల్

కీలకమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల 21 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్రం అరకొర నిధులను మాత్రమే విడుదల చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విదల్చడం లేదు. అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల చిరకాల వాంఛ నెరవేరాలంటే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తన వాటా నిధులు ఇవ్వడంతో బాటు కేంద్రంపై ఒత్తిడి పెంచి త్వరితగతిన ప్రాజెక్టు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిఎం వైఎస్.జగన్ నిధుల విడుదలపై ప్రకటన చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

పడకేసిన పర్యాటకం

కోరంగి మడ అడవులు, హోప్ ఐలాండ్ కాకినాడ, ఎస్.యానాం, ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాలు ఇలా అనేక పర్యాటక ప్రదేశాలు ఉమ్మడి జిల్లాకు సొంతం. కానీ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించిన పాపాన పోవడం లేదు. కాకినాడ బీచ్ అభివృద్ధి నిలిచిపోయింది. జిల్లా పర్యాటకాభివద్ధిపై గంపెడు ఆశలతో ఉన్న ప్రజలకు జగన్ పర్యటన ద్వారా ఊరట లభిస్తుందని ప్రజాప్రతినిధులు ఆశిస్తున్నారు.

సబ్ ప్లాన్ గ్రామాలను గాలికొదిలేసిన సర్కారు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న 56 సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని అనేకేళ్లుగా గిరిజనులు డిమాండ్ చేస్తున్నా జగన్ సర్కారు పట్టించుకోవడం లేదు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు లేక ఇక్కడి గిరిజనులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ గిరిజనుల హక్కులు పూర్తిగా అణచి వేయబడుతున్నాయి. ఇప్పటికైనా సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయకపోతే వైసిపి ప్రభుత్వానికి తీవ్ర ప్రతిఘటన తప్పేలా లేదు. సిపిఎం ఆధ్వర్యాన అనేకసార్లు ఆందోళనలు జరిపి, కలెక్టర్‌కు వినతులు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

శాస్త్రీయ దృక్పథమే విజయానికి పునాది

ప్రజాశక్తి-అమలాపురం

శాస్త్రీయ దృక్పథమే విద్యార్థుల విజయానికి పునాదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనబరిచి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ఎంపికైన నేదు నూరు జెడ్‌పి పాఠశాల, వన్నెచింతపూడి జెడి ఉన్నత పాఠశాల, అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యా ర్థులను, రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలు నందు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న దంగేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యా ర్థులను వారికి శిక్షణ ఇచ్చిన గైడ్ టీచర్లను ప్రోత్సహించిన హెచ్‌ఎంలను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ స్థానిక ఛాంబర్ కు పిలిచి జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సైన్స్ అధికారి సమక్షంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభివద్ధికి, క్రమశిక్షణ, పట్టుదలకు శాస్త్రీయ దక్పథం అవసరమని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక సంబరాల్లో పాల్గొని విజయం సాధించడం అభినం దనీయమన్నారు. విద్యార్థుల్లో సైన్స్ ఫెయిర్ లు మూలంగా సైన్స్ పట్ల అవగాహన, పోటీతత్వం పెరుగుతా యన్నారు.జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలోని సజనా త్మకతకు ఉపాధ్యాయుల సూచనలు జోడించి చేసిన పలు ప్రాజెక్టుల ద్వారా ప్రతిభను చాటుకోవడం అభినందనీయమన్నారు. అదేవిధంగా శాస్త్రవేత్తలుగా ఎదగడానికి అవకాశాలు కల్పిస్తాయన్నారు. ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి జాతీయస్థాయిలో కూడా రాణించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి, పాఠశాలల హెచ్‌ఎంలు ప్రసాద రాజు, సత్య నారాయణ, గౌరీ శంకర్, గైడ్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర అకస్మిక తనిఖీలో భాగంగా మంగళవారం అమలాపురం మండలం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పేరూరు-4 సచివాలయం నందు జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. ఆయన రికార్డ్స్ ను పరిశీలించి వైద్యాధికారికి, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంట ఎంపిహెచ్ఇఒ.రామకృష్ణమూర్తి, వైద్యాధికారి వెంకటేష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి తోట

రోడ్డు పనుల పరిశీలన


ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం వద్ద చేపట్టిన సిసి రోడ్డు పనులు ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఎంపిపి ఉండమట్ల వాసుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాల సమస్యగా ఉన్న ఈరోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఆయన వెంట యువనేత తోట పథ్వీరాజ్, సురుచి ఫుడ్స్ అధినేత పొలిశెట్టి మల్లిబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్రీ పాపారాయుడు, పార్టీ నాయకులు నాగిరెడ్డి రాంబాబు, గ్రంధి సూరిపండు, దాసరి లాజర్, బురా చిన్న ఉన్నారు.

వైసిపి బిసి సెల్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్

మండపేట వైసిపి బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియకమైన కుక్కల శ్రీనివాస్ మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను ఎంఎల్‌సి అభినందించి మాట్లాడుతూ పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసి, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ విజయం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండపేట సొసైటీ అధ్యక్షులు పెంకే గంగాధర్, పట్టణ శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పాటలు పాడుతూ.. దున్నపోతుకు వినతిపత్రాలు అందిస్తూ...



కొత్తపేటలో పాటల పాడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మండపేటలోదున్నపోతుకు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



అమలాపురంలో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు, పాల్గొన్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

22వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల పరిష్కారంకోసం అంగన్‌వాడీలు సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. తమ డిమాండ్లు నెరవేర్చాలని దున్నపోతులకు వినతిపత్రాలు అందజేసి, పాటలుపాడి నిరసన తెలిపారు. **అమలాపురం** అమలాపురం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా తమ సమస్యలు పరిష్కారం చేయాలంటూ దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. సమ్మె శిబిరంలో పి.అమూల్య, విజయ, రత్నకుమారి, మణిమాల, దైవకప, బేబీ గంగారత్నం, ఐసిడిఎస్ ప్రాజెక్టుకు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు పాల్గొన్నారు. **కొత్తపేట** తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ కొత్తపేటలో అంగన్‌వాడీలు కళా జాతలో భాగంగా పాటలు పాడారు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద రాష్ట్ర సంఘం సిఐటియూ పిలుపుమేరకు తమ డిమాండ్లు నెరవేర్చా లని నినాదాలు చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు పి.వెంకటలక్ష్మి, కె.సూర్య కళ, ఇందిరా రాణి తదితరులు మాట్లాడారు. నాలుగు మండలాల నుంచి అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **మండపేట** స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ డిమాండ్లను నెరవేర్చాలని దున్నపోతుకు వినతిపత్రం అందించి వినూత్నంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. పలువురు అంగన్వాడి నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మెను మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26వేలు, పిఎఫ్ అందించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు నాయకులు ఆదిలక్ష్మి, బేబీ, వజ్రం, సూర్యకుమారి, కుమారి,రాణి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 22రోజులు నుంచి తహశీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ప్రభుత్వం పటింసుకోకపోవడంతో దున్నపోతుకి సమస్యలు వినతిపత్రం అందచేసి అంగన్‌వాడీలు విన్నుతనిరసన తెలిపారు. ఈసమ్మెకు యుటిఎఫ నాయకులు కుడిపూడి సత్యనారాయణ తదితరులు మద్దతు తెలిపారు. **రామచంద్రపురం** సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల అంగనవాడిలు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతుకు వినతి పత్రం అందజేసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం చూస్తుంటే మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటి అనేది అర్థం అవుతుంది అన్నారు సత్యనారాయణ మద్దతు తెలియజేశారు. సమ్మెలో అంగనవాడీ నాయకులు వాసంశెట్టి సూర్యకుమారి, విజయలక్ష్మి, శ్రీదేవి, వీర వేణి, సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కోరుతూ 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం అన్యాయం అంటూ దున్నపోతు వినతిపత్రం అందించి ముమ్మిడివరం ప్రాజెక్ట్ అంగన్ వాడి లు వినూత్నంగా నిరసన ఆందోళన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడి కార్యకర్తలు మరియు సహాయకులు చేపట్టిన నిరవధిక సమ్మె లో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అధ్యక్ష కార్యదర్శులు దుర్గా మల్లేశ్వరీ,జయలక్ష్మీ అద్వర్యంలో 22వ రోజైన మంగళవారం సమ్మె శిబిరం వద్ద నిరసనలో పాల్గొన్న అంగన్ వాడి లకు సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గా ప్రసాద్ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మొద్దు ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంగన్ వాడి లతో కలిసి దున్న పోతుకు సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని మెడలో వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విశిష్ట సేవలు అందిస్తున్న అంగన్ వాడి లకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని నలుగున్నరెళ్లుగా మొర పెట్టుకుంటే కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా జనవరి 3 న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి కను విప్పు కలిగించాలని సూచించారు. వీరికి పలు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. ఈ రిలే దీక్షలో సుబ్బలక్ష్మి హైమావతి టి శ్రీదేవి తలుపు లమ్మ, జి.మంగాయమ్మ విజయ రత్న కుమారి లతో పాటు సుమారు 500 మంది అంగన్ వాడీలు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో దున్నపోతుకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



ముమ్మిడివరంలో దున్నపోతుకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



దున్నపోతు కి వినతిపత్రం అందిసున్న మామిడికుదురు అంగన్‌వాడీలు

7న ర్యాలీలో చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామం రామకష్ణ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఈనెల 7న ఆదివారం జిల్లా స్థాయి చెక్కుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా జ్ఞాన విజ్ఞాన వేదిక అధ్యక్షులు డాక్టర్ ఇఆర్. సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన జిల్లాస్థాయి జనవిజ్ఞాన వేదిక జరిగే ప్రాంగణాన్ని పరిశీలించి చేయవలసిన కార్యక్రమాలను పర్యవేక్షించారు .ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చెకుముకి టెస్ట్ నందు జిల్లాలోని ప్రతి మండలాల నుంచి టీంకు ముగ్గురు విద్యార్థులు చొప్పున 26 యూనిట్ల నుంచి 52 టీమ్స్ కు చెందిన 156 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి చేతులమీదుగా బహుమతి ప్రదానం చేస్తాం న్నారు. కార్యక్రమంలో జిల్లా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఖాజా ముద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు జనిపల్లి సత్యనారాయణ, చెకుముకి జిల్లా కన్వీనర్ ఎన్ అబ్బులు, రిసోర్స్ పర్సన్ ఎ.రామకష్ణ, ఆత్రేయపురం మండల జెజివి వేదిక కన్వీనర్లు ఎస్.ప్రసాద్, రామకష్ణ, సుధాకర్ బాబు, శ్యామ్ కుమార్, మానేపల్లి రవి, గోవిందు, డాక్టర్ మోహిత్, రావులపాలెం అధ్యక్షులు లింగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బీమా అందజేత

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడు లంకలో మృతుల కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా సొమ్ము ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మంజూరయ్యాయి. సొమ్మును బాధిత కుటుంబాలకు చెందిన గుబ్బిపు సత్యవతి, ఆవాల లక్ష్మీ లకు మంగళవారం సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా ద్వారా అందజేసిన రూ.లక్ష వాళ్లకు ఎంతో భరోసాగా ఉండి, ఆర్థిక కష్టాల నుండి బయటపడేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొండపాటి చంటి, సొసైటీ డైరెక్టర్ అడబాల వీర్రాజు, వైసిపి నేత మోటూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-ఆలమూరు

గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో గ్రామ సచివాలయ మహిళా పోలీసులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో నేరాలను అదుపు చేయటంలో కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీను నాయక్

బస్టాండ్లు పాఠశాలల వద్ద బాలికలను ర్యాగింగ్ చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల ఊపేక్షించ వద్దని ఆయన అన్నారు

'వక్కలంక'కు బస్సు సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-అంబాజీపేట

వక్కలంక గ్రామంలో బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్న వక్కలంక గ్రామస్తులు, సర్పంచ్ వాసంశెట్టి రేవతి పెదబాబుకి సమస్యను తెలియజేశారు. వెంటనే రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి అమలాపురం డిపో డిఎంకు తక్షణం వక్కలంక గ్రామానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేయమన్నారు. ఈ బస్సు సర్వీసును మంగళవారం పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు సర్పంచ్లు, సొసైటీ ఛైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



వక్కలంక బస్సు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు



పోలీసుల అదుపులో నిందితుడు

ఎసిబి అధికారి పేరుతో మోసం : వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-మండపేట

ఎసిబి ధికారినని రూ.3,05,000 నగదు కాజేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామచంద్రపురం డిఎస్‌పి. టిఎస్‌ఆర్‌కె. ప్రసాద్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. నిందితుడు రాచంపల్లి శ్రీనివాసులు అనంతపురం జిల్లాలోని పట్నం మండలంలోని మల్లికవేలను గ్రామానికి చెందిన వాడన్నారు. ఇతను గత 15 సంవత్సరాలుగా దొంగతనాలు, స్నాచింగ్, మోసం, దోపిడీ తదితర నేరాలకు పాల్పడుతున్నాడని ఇతనిపై ఆంధ్రా, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలలో 100 కేసులు నమోదు అయ్యాయన్నారు. ఇతను ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ ఎసిబి అధికారులమని ఫోన్ చేసి వారిని భయభ్రాంతులకు గురి చేసి వారి వద్ద నుండి డబ్బులను దోచుకుంటాడని పదవి విరమణ కాబోతున్న ఉద్యోగులను ఎంచుకుని వారిని బెదిరించి డబ్బులు గుంజుకుంటాడన్నారు. డైలీ హంట్ యాప్ ద్వారా తమ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎఎస్ఐ వెంకటేశ్వరరావుకు ఎసిబి అధికారినని ఫోన్ చేసి నగదు కాజేశాడన్నారు. ఎఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సిఐ శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ బి.శివకష్ణ, సిబ్బంది నక్కా నారాయణ, దోనిపాటి రవికిషోర్, పి. గంగరాజు టీమ్ ఏర్పాటుచేసి నిందితుడు చేసిన ఫోన్ కాల్ సమాచారంతో బెంగుళూరులోఉన్నట్లు గుర్తించారన్నారు. అక్కడకు వెళ్లి నిందితుడి సమాచారం సేకరించి నిందితుడు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ దగ్గర వున్నట్లు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకుని రూ.2,10,000 రికవరీ చేశారన్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని అభినందించారు.

పంచాయతీ సిబ్బందిపై దాడి కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

డ్రైనేజీ పూడికతీత పనులు చేయిస్తున్న పంచాయతీ సిబ్బందిపై కర్రలతో దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. ఆత్రేయపురం గ్రామ సచివాలయంలో సబార్డినేట్ పనిచేస్తున్న వికలాంగుడు జివివి.సత్యనారాయణ విధి నిర్వహణలో భాగంగా మంగళవారం స్థానిక చిన్న పేటలో శానిటేషన్ నిర్మూలన లో భాగంగా డ్రైనేజీ పూడికతీత పనులు చేయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పూడిక తీసిన మట్టి వ్యర్థాలను రోడ్డుమీద వేయడంతో చెంతనే ఉన్న ఆటో మీద పడ్డాయి. బండి దిలీప్ అనే వ్యక్తి నా ఆటో పై డ్రైనేజీ వ్యర్థాలను ఎందుకు వేశారంటూ సత్యనారాయణ తో గొడవ పడి దుర్భాషలాడి కర్రతో కొట్టి గాయపరిచాడు. ఈ విషయాన్ని పంచాయతీ ఆఫీసుకు తెలియపరచడంతో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అక్కడ చేరుకునే లోపే డిజిటల్ అసిస్టెంట్ చింత సాయిరాంను, సత్యనారాయణను బండి దిలీప్, రవికుమార్, వినయ్, పమ్మి రాజ్ కుమార్, పమ్మి బేబీ అయిదుగురు కలిసి దుర్భాషలాడి కర్రలతో కొట్టి గాయపరిచారు. దీనిపై కేసు నమోదు చేశామ ఎస్ఐ బివై .కిరణ్ కుమార్ తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట మండలం జె.కొత్తూరులో మంగళవారం స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తన సిబ్బందితో సారా విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కేసుబోయిన వీరాజును పది లీటర్ల సారాతో అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సామర్లకోట పట్టణ శివారు కందకం ప్రాంతానికి చెందిన చిట్టిరాజు విద్యుత్ స్తంబాల కార్మికునిగా పనులు చేస్తుంటాడు. మంగళవారం సామర్లకోట శివారు ఎడిబి రోడ్డు రాక్ సిరామిక్ సమీపాన వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌పార్మర్ వద్ద మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చిట్టి రాజుకు శరీరం అంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

పేకాట శిబిరంపై దాడి ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక డ్రైవర్స్ కాలని శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.23,140లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

నాటు సారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని కలవలపల్లిలో మంగళవారం ఎస్ఇబి సిఐ విటివివి సత్యనారాయణ సిబ్బంది కలసి నాటు సారా స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో కలవలపల్లి గ్రామానికి చెందిన ఎం.సుబ్బలక్ష్మి నాటుసారా విక్రయించేందుకు నిల్వ చేసిన 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేశారు. దాడుల్లో ఎస్ఐ జి.బసంతి సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటికాలిపై మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేపట్టారు. మంగళవారం సమ్మె 8వ రోజుకు చేరింది.

మండపేట వారి సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికుల ఒంటి కాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి నాటికి 8వ రోజుకు చేరుకుంది. పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ నిత్యం పట్టణ ప్రజల ఆరోగ్య కోసం వారి ప్రాణాలను పణంగా పెట్టి పట్టణ పరిశుభ్రత కోసం పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయడం సరికాదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల తల రాతలు మారడంలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు ప్రభుత్వం పెంచాలన్నారు.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కొమరపు నరేంద్ర కుమార్, బంగారు కొండ, లోవరాజు, విజయ్, సవరపు సరోజినీ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** డిమాండ్లు నెరవేర్చాలంటూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. సమ్మె సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జిల్లా కార్యదర్శి నూకల బలరాం, గోరిపర్తి నాగభూషనం సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు.శిబిరానికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ స్టాలిన్ మద్దతు తెలియజేసి మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఇప్పటివరకు రెగ్యులర్ చేయకపోవడం దారుణమన్నారు.25 సంవత్సరాలు పైబడి వీళ్ళు పనిచేస్తున్నారని ప్రభుత్వం ఇప్పటికి అయిన వీళ్ళ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ సమ్మెలో పిల్లి వెంకటరావు, చేగొండి సుబ్బారావు,గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, గోరిపర్తి భీమశంకర్, ముత్యాల నాగరాజు, గూడుపు చిన్న అప్పారావు, మందపల్లి వినోద్ మరియు కార్మికులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ టిడిపి ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్టా శివ ప్రసాద్ ఆధ్వర్యం లో రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు టిడిపి కౌన్సిలర్లు దివి మహాలక్ష్మి, అడబాల సతీష్ కుమార్‌లతో పాటు టిడిపి నాయకులు కట్టా సత్తిబాబు, కడలి నాగు, విళ్లవీరా స్వామి నాయుడు, గొల్లపల్లి గోపి, మాదాల బుజ్జి



మండపేటలో ఒంటి కాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు

జనిపల్లి సత్యనారాయణ, ఎపి జిఇఎ జిల్లా నాయకుడు పి.సుబ్బారాయుడు, ఎండి ఇక్బాల్ మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు ఎస్.అరుణ్ కుమార్, నక్కా అరుణ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, కాశి జార్జి, జి. రమేష్, ఎస్.శరత్ పలువురు కార్మికులు పాల్గొన్నారు. **అమలాపురం** అమలాపురంలో మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు నాయకులు గోపి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగింది. వివిధ సంఘాల వారు, కొప్పుల సత్తిబాబు వారి బృందం శిబిరానికి విచ్చేసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కోటేష్, మూర్తి, దుర్గాప్రసాద్, శ్రీను, అప్పారావు, వరలక్ష్మి, తలుపులమ్మ, అనంతలక్ష్మి, నీలావతి బుజ్జి, సత్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రామచంద్రపురంలో మున్సిపల్ కార్మికుల నిరసన



అమలాపురంలో మున్సిపల్ కార్మికుల నిరసన, మద్దతు తెలిపిన ప్రజాసంఘాల నాయకులు



ముమ్మిడివరంలో ఎస్ఎస్ఎల సమ్మెకు మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు

ఎస్ఎస్ఎలను విద్యాశాఖలో విలీనంచేయాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమ బద్ధికరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ కళాశాల్లోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 14వ రోజైన మంగళవారం ఉరి తాళ్లు బిగించుకొని ఎస్ఎస్ఎ జెఎసి ఆందోళన చేపట్టింది. ఈ సమ్మె శిబిరాన్ని సిఐటియు నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులైజేషన్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలకు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎస్ఎల సమ్మెకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంఇఒలు సంఘీభావం తెలిపారు. ఎస్‌టియు, యుటిఎఫ్ సంఘాలతో పాటు కార్మిక సంఘాలు మద్దతు తెలిపారు. ఈ సమ్మెలో సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో ఉరితాళ్లు బిగించుకుని ఎస్ఎస్ఎ ఆందోళన

అంగన్‌వాడీలకు నోటీసుల జారీ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

అంగన్ వాడీలు తమ డిమాండ్ల సాధనకై 22 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. సమస్యలు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. జనవరి 5 లోగా విధుల కు హాజరు కావాలని లేకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ల ద్వారా 'ప్రభుత్వ విజ్ఞప్తి' పేరుతో అంగన్ వాడీలకు నోటీసులు జారీ చేయి ంచింది. సమ్మె ప్రభావంతో ఎదురవు తున్న ఇబ్బందుల దృష్ట్యా విధుల్లో చేరాలని నోటీసులో కోరింది.

సమ్మెల రాష్ట్రంగా ఎపి

ప్రజాశక్తి-మామిడికుదురు

గతంలో ఆంధ్రప్రదేశ్ అంటే స్వర్ణాంధ్ర నవ్య ఆంధ్ర ప్రదేశ్ చెప్పుకునేవారు, కానీ ఈ రోజున సమ్మెల ఆంధ్ర ప్రదేశ్‌గా మారిందని పిసిసి ప్రధాన కార్యదర్శి మాసవరపు శ్రీ మన్నారాయణ విమర్శించారు. మామిడికుదురులో మంగళవారం మండల శాఖ అధ్యక్షులు అప్పన శ్రీ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యకర్తలు సమావేశానికి విచేశారు. దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పాలనపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి అనేటువంటి నినాదంతో గ్రామస్థాయికి కాంగ్రెస్ పార్టీని తీసుకువెళతామన్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీ వాకపల్లి రాంబాబు మరియుసంసుద్దీన్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైసిపి ఇన్‌ఛార్జ్‌ల నియామకం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

వచ్చే ఎన్నికలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల ఇంచార్జ్‌లను నియమిస్తోంది. తాజాగా మంగళవారం అధిష్టానం రెండో జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ మంత్రి, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారుడు పిల్లి సూర్యప్రకాష్, పి.గన్నవరం (ఎస్‌సి) నియోజకవర్గానికి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, పిఠాపురానికి కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేటకు మాజీ మంత్రి తోట నరసింహం, ప్రత్తిపాడుకు మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు, రాజమండ్రి సిటీకి ఎంపీ మార్గాని భరత్, రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రస్తుతం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను నియమిస్తూ అధిష్టానం ప్రకటించింది.



ఎంఎల్ఎ సతీష్ కు సంఘీభావం తెలుపుతున్న మంత్రులు వేణు, విశ్వరూప్

అమెరికాలో రోడ్డు ప్రమాద మృతులకు అంతిమ యాత్ర

ప్రజాశక్తి-అమలాపురం

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అమలాపురానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మృతిచెందిన విషయం విదితమే. మృతదేహాలను మంగళవారం అమలాపురం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ నివాసం వద్ద కొంతసేపు ఉంచి అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు. మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు మృతులకు నివాళు లు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రులో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ప్రారంభించారు. దశల వారీగా గ్రామంలో రోడ్డు నిర్మాణాలు చేపట్టనున్నట్టు సర్పంచ్ శ్రీదుర్గ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంగ కనకదుర్గ, ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, వైసిపి నేతలు జొన్నాడచిన్ని, దొంగ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

నేడు కేంద్ర మంత్రుల పర్యటన

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ఫిషరీస్, పశుసంవర్థక మరియు పాడి పరిశ్రమ శాఖామంత్రి పరుషోత్తమ్ రూపాల, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ బుధవారం యానాంలో పర్యటించనున్నారని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి మూడు గంటల వరకు సావిత్రి నగర్ ఫిషింగ్ హార్బర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. కేంద్ర మంత్రులు మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రి నగర్, గిరియంపేట, మత్స్యకార గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి అశోక్ కోరారు

మాదకద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశపు హాలునందు. గంజాయి, ఇతర డ్రగ్స్ నియంత్రణ పై నియమింపబడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే పదార్థాలని. మాదక ద్రవ్యాల వాడకం ఒక ప్రమాదమైన వ్యసనమని, నేటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనదని అన్నారు. కమిటీలో ఉన్న అన్ని విభాగాల వారు నియంత్రణ చర్యలపై నివేదికలను పోలీస్ శాఖకు సమర్పించిన యెడల వాటిని క్రోడీకరించి పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తారన్నారు. డ్రగ్ ఎడిట్ కేసులను గుర్తించి వారికి స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నందు డాక్టర్ సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డి ఎడిక్షన్ కేంద్రంలో జాయిన్ చేయించి సాధారణ స్థితికి చేరుకునేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆల్కహాలు ఎడిట్ డ్రగ్ కేసులకు చికిత్సలు స్థానికంగా అందుబా టులో ఉన్నాయన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కూడా దష్టి సారించాలన్నారు. ఆర్‌డిఒ, డిఎస్‌పిలు తమ పరిధిలోని ప్రవేట్ కళాశాల్లో విద్యార్థులతో క్లబ్బులు ఏర్పాటు చేసి ర్యాగింగ్, గంజాయి, యాంటీ డ్రగ్ కార్యకలా పాలు డ్రగ్స్ వాడకంపై కలిగే అనర్థా లపై పూర్తి అవగాహన ను పెంపొం దించి ఎడిక్షన్ స్థాయికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎడిక్షన్ స్థాయి నుంచి బయటపడిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాదు లు బ్యాంకు రుణంతో ముడిపడి ఉన్న రాయితీ పథకాలతో కల్పించాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలు సమాజంలో తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతాయన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా ను, వినియోగాన్ని అరికట్టడమే ఈ కమిటీ యొక్క ప్రధాన ఉద్దేశ్య మన్నారు. గత సమావేశంలో చేసిన తీర్మానాలపై తీసుకున్న చర్యలను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఎస్.ఖాదర్‌బాషా, ఆర్‌డిఒలు జి.కేశవర్ధన్ రెడ్డి ఎస్.సుధా సాగర్, జిల్లా స్థాయి అధికారులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం మంగళవారం జరిగింది. వివరాలు ఇవి..

ఆత్రేయపురం వసంతవాడలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపిడిఒ నాతి బుజ్జి, డాక్టర్ ఎన్.సుమలత పర్యవేక్షణలో గ్రామ సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. వైద్యులు టి.శ్రీకాంత్,. ఐ.హైమాశ్రీ ,వైద్య సేవలు అందించారు. ఈ క్యాంపులో భాగంగా ఉచితంగా ఇసిజి, ల్యాబ్ పరీక్షలు నిర్వహించి, 237 మందికి వైద్య సేవలు, 37 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులను పంపిణీ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ క్యాంపు లు జనవరి నుంచి జూన్ వరకూ ప్రతి వారం ఒక్కో సచివాలయం దగ్గర నిర్వహిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతలో బాధపడుతున్న వారికి రిఫరల్ ఆస్పత్రులకు తరలించి అక్కడ ఉచితంగా అన్ని వైద్య సేవలు అందేలా చేస్తారని తెలిపారు. **అమలాపురం (అల్లవరం)** అల్లవరం మండలం గోడి గ్రామ సచివాలయం నందు జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం సర్పంచ్ తోట శ్రీదేవి నరసింహారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటమే జగనన్న లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి మహేష్, ఎంపిపి ఇళ్ల శేషగిరిరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** అందరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అడిషనల్ జిల్లా వైద్యాధికారి సిహెచ్.భారత లక్ష్మి అన్నారు. మండలంలోని అయినా పురం జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో మంగళవారం స్థానిక సర్పంచ్ మోకా రామారావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం జరిగినది. . ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 306 మంది వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీ పూజా, విజయ కుమార్ సిందుజా మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండలం వసంతవాడలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ '

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం మంగళవారం జరిగింది.

ఆలమూరు మండలంలోని పినపళ్ళలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకుగ్యారెంటీ, రచ్చబండలి కార్యక్రమాలు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ, నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి బండారు సత్యానందరావు మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నివిధాలా దోచుకుంటున్న వైసిపి ప్రభుత్వాన్ని రాష్ట్రం నుండి తరమికొట్టాలని అన్నారు. ఇసుక, మట్టి దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఏ చిన్న కొనుగోలు చేసినా డిజిటల్ పేమెంట్లు అనుమతిస్తారు కానీ ఒక్క మద్యం షాపులో మాత్రం ప్రభుత్వం నగదు చెల్లించి కొనుగోలు చేయాలనడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** ::రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రానుందని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రేవు రమేష్ పేర్కొన్నారు. కాట్రేనికోన పంచాయితీ పరిధిలోని మొండి పోర, చిలకాయి చెరువు తదితర ప్రాంతాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా మొండిపోర గ్రామంలో టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా కార్యదర్శి రేవు రమేష్ రేవు రమేష్‌తో పాటు మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు మాదే యోగేశ్వరి, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్తాల ప్రసాద్, గెద్దాడ శ్రీను, నేలపాటి రాంకి, పచ్చిమాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రామచంద్రపురం

టిడిపి జర్నలిస్టులకు ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడ తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత జర్నలిస్ట్ లకు అక్రిడేషన్, బస్సు పాస్ లు,ఇళ్ళ స్థలాలు మొదలైన విషయాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. అనంతరం ఇటీవల పార్టీలో చేరిన పలువురు నాయకులను ఆయన విలేకరులకు పరిచయం చేశారు. అనంతరం నూతన సంవత్సరను పురస్కరించుకొని విలేకరులు అందర్నీ దుస్సాలువాల తోనూ, జ్ఞాపికలతో సత్కరించారు.

మోడరన్‌లో క్రీడావారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మోడరన్ హైస్కూల్లో క్రీడావారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ని మోడరన్ అధినేత లయన్ జి.వి.రావు, ప్రధానోపాధ్యాయులు ఎం.చిట్టిబాబు క్రీడాజ్యోతి వెలిగించి క్రీడావారోత్సవాలు ప్రారంభించారు.జి.వి.రావు మాట్లాడుతూ విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా వారిలో క్రీడా, నాయకత్వం పట్ల ఆసక్తిపెంపొదించుటకు క్రీడలుదోహదపడతాయాని పేర్కొన్నారు. వివిధ క్రీడాపోటీల్లో విద్యార్థులుఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడరన్ హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మోడరన్ స్టాఫ్, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విఒఎల నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రజాశక్తి- తాళ్లరేవు

విఒఎల నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం తాళ్లూరు మండలం మహిళా సమాఖ్యలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా కమిడి ఈశ్వరీబాయి, ఉపాధ్యక్షులుగా బళ్ల ఝాన్సీ, కార్యదర్శిగా మోర్త వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా కొక్కిలిగడ్డ నాగమణి, కోశాధికారిగా చెల్లదుర్గ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని గత యూనియన్ నాయకులు మంగామణి, ఉషారాణి, రత్నకుమారి తదితరులు అభినందించారు.


రాము కార్టూన్‌కి ప్రత్యేక బహుమతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

హాస్యానందం తెలుగు మాసపత్రిక, గుళ్లపల్లి అరుణ కుమారి స్మారక కార్టూన్ పోటీ-2024 లో బండారులంక గ్రామానికి చెందినకార్టూనిస్ట్ మాడా రాము వ్యంగ్య చిత్రం ప్రత్యేక జ్యూరీ బహుమతికి ఎంపికైంది. ఈ సమాచారం హాస్యానందం జనవరి 2024 సంచికలో ప్రకటించి, బహుమతి ప్రదాన సభ జనవరి 26న విజయవాడ బాలోత్సవ భవన్‌లో జరగనుందని కార్టూనిస్ట్ రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక స్పృహ తో ఆలోచనాత్మక వ్యంగ్య చిత్రాన్ని గీసిన రామును కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూటుకూరి సుబ్రహ్మణ్య స్వామి, గౌరవాధ్యక్షుడు చింతా శంకరమూర్తి, కార్యవర్గ సభ్యులు, ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. చలపతి రావు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ముషిణి రామకృష్ణ రావు తదితరులు అభినందించారు.



బహుమతి పొందినవ్యంగ్య చిత్రం



రాము, కార్టూనిస్ట్